# అడవిలో మొక్క

గుడిసె ముందరి నిద్రగన్నేరు చెట్టు వడదెబ్బకి నీరసించిపోయిన పసిపిల్లాడిలా వడలి పోయిఉంది. మట్టితో అలికిన వాకిలి మే నెల ఎండకి పగుళ్ళిచ్చిపోయి ఉంది.

"ఆ ఎన్టీవోడొచ్చి రెండ్రూపాయల బియ్యమంటే, సారాయి లేదంటే, ఇదుగో అల్లు డొచ్చి డ్రాక్రాలు, పొదుపులక్ష్మి అంటే సంబరపడిపోతిమి. మనంగూడ వోళ్ళతో పాటుగా దిగులూ, యిచారం లేకుండా బతకొచ్చనుకుంటిమే... అం ఏమీలేదబ్బా ఎవుడొచ్చినా, ఏం చేసినామన్నా మన బతుకులు మాత్రం యింతే. యిట్టనే ఎలబారాల్సిందే... అమెరికా వోడొచ్చి మాత్రం ఏంజెయిబోతాడు"

వాకిట్లోని మట్టి అరుగు మీద గొంతుక్కూచుని సమయం, సంధర్భం లేకుండా మాట్లాడుతోన్న తల్లికేసి మింగేసేలా చూసింది బుజ్జమ్మ.

'ముసల్దానికి దినదినానికీ తెలివిలేకుండా పోతుండాది.

ఈడ మనుం మాట్లాడకునే విషయమేందో... ఈమి మాట్లాడే మాటలేంది?...' అనుకుని ఏదో విసురుగా అనబోయి ఒకవేళ మనవరాలికి మన బతుకుల గెతి, గతుకులూ ఎత్తి చూపీడం కోసం యిట్లా అర్థం పర్థం లేకుండా మాట్లాడుతోందేమోనని అర్థమయి తటపటాయిస్తూ మౌనం వహించింది.

అప్పటికి వాకిలి చిమ్మడం పూర్తికావడంతో చీపురు పక్కన పడేసి, గుడిసె గుమ్మంలో కొచ్చి లోపలికి తొంగిచూసింది బుజ్జమ్మ.

ఒంటినిట్రాటి గుడిసె లోపల ఒకపక్కగా కూర్చుని వుంది జ్యోతి. పావడా కొసని పాదాల కింద తొక్కిపట్టి, మోకాళ్ళ చుట్టూ చేతులు బిగించి మోకాలి చిప్పల మధ్య గడ్డం ఆనించి, మేనత్త వైపూ, నాయినమ్మ వంకా పులుకూ పులుకూ చూస్తోంది.

బయట బరబరామంటోన్న చీపురు శబ్దం ఆగడం, అటుపిమ్మట అత్త గుమ్మం వంక వస్తున్నట్లుగా నీడ కదలాడ్డంతో గబుక్కున మొహాన్ని మోకాళ్ళలో దాచేసుకుంది. అప్పటికే బుజ్జమ్మ గుమ్మంవద్దకి రావడంతో, మేనకోడలి చేష్ట చూసి మరింత ఒళ్ళుమండి అరవసాగింది.

"మేః ఇదే ఆఖరుసారిగా చెప్తుండా... నేన్చెప్పినట్లుగా యిన్నావా సరే వుంది. లేదంటే మీ అమ్మకాడికి పార్సిలు జేసేస్తా..." కుడిచేయి తర్జని చూపిస్తూ బెదిరిస్తున్నట్లుగా అంది బుజ్జమ్మ.

జ్యోతి గుండె గుబగుబలాడింది... వణుకుతూ గట్టిగా కళ్ళు మూసుకుని అట్లాగే వుండిపోయింది... ఏం మాట్లాడకుండా.

ముప్పయి దినాలుగా ముగ్గురి నడుమ నలుగుతోన్న సమస్య ... మూడు దినాలుగా ముడివడి మధ్నాన్నానికి ముట్టిమోపు కొచ్చింది.

ఒంటిగంటకి రెడ్డోరింటి కాడ్నించి ఒచ్చింది మొదలు ఒకటిగానే ఎత్తుకుంది బుజ్జమ్మ... ముందు వస్తానే మంచినీళ్ళు పట్టిపెట్టనందుకు శాపనార్థాలు పెట్టింది. ఆ తరువాత వాకిలి చిమ్మకోలేదని ఎగిరిపడింది. ఇక అప్పట్నించీ జ్యోతి తను చెప్పిన మాట వినడం లేదని మొదలుపెట్టింది.

నీళ్ళు పట్టుకొచ్చి పెడుతూ తిట్టింది. వాకిలి చిమ్ముతూ చెప్పి చూసింది. అయినా జ్యోతిలో కదలిక లేదు.

నిజానికి బుజ్జమ్మ తమ ఎరికల కులంలో తప్పబుట్టిందని అంతా అనుకుంటారు. మాటతప్పనితనం, యాజమాని కాల్తో చెప్పిన పని చేత్తో చేసుకుపోవడం ఎప్పుడయినా రెడ్డమ్మలు నోరు చేసుకుని అరిచినా పన్నెత్తి మాట్లాడకపోడం, వాళ్ళు చేయి ముట్టిపెడితే తప్ప అది కావాలి, యిది కావాలి అంటూ షరతులు పెట్టకపోవడం, ఒకరు వేలెత్తి చూపించలేని పనితనం, పని, పని, పని అంటూ పనిరాక్షసిలా మూడిళ్ళలో చాకిరీ చేసొచ్చి తిరిగి తనింట్లో పనంతా తనే చూసుకుంటుంది బుజ్జమ్మ.

"మొదులాయమ్మిగ్గాన యింత బిన్నా పెళ్ళికాకుండా వుంటే, ఏ బాదాలే... మిమ్మల్నంతా అడగబోయేది లే..." చేతులు తిప్పుతూ మనవరాల్ని అదిలిస్తున్నట్టుగా గొణుక్కుంటోంది సుబ్బమ్మ.

తల్లికేసి కొరకొరాచూసి -

"ఇంటాయనుంటే మంగలాయన్ని పిల్చుననట్టుగా వుండాది. నా బిడ్డుంటే ఈ లంజిని అడిగేదేముండాది. ఆయమ్మి లేకనే కదా ఈ బాధంతా. అయినా చేసి పెట్టినట్టల్లా తినికూచోని కొవ్వు బట్టుండాదీటికి." తాను కష్టంజేసి అదితెచ్చిపెడితే తిని, తిరుగుతోన్న మేనకోడళ్ళ మీద చెప్పలేనంత ఆవేశంగా వుంది బుజ్జమ్మకి.

ఎండిపోయిన రొమ్ముమీద పట్టు దొరక్కుండా జారిపోతోన్న పాత టెర్లిన్ చీరని మాటిమాటకీ సర్దుకుంటూ ఆవేశంగా అరుస్తోన్న అత్తకేసి జాలిగా చూసింది జ్యోతి. చిన్నరెడ్డమ్మంత వయసుంటాది అత్తకి. ఆయమ్మ మాదిర్తో కిరిములూ, ఫేరండ్లవ్లీలూ పూసి, జ్యూసులు తాగిస్తే అత్త రెడ్డమ్మ కంటే కూడా అందంగా వుంటాది. అక్కలు, చెక్కులుతో కూడా ఎండుకుపోయి వున్న అత్త మొహాన్ని బుగ్గలతో వూహించుకుంటూ ఆనందిస్తోంది జ్యోతి.

జ్యోతి చాలాసార్లు అత్తతో కలిసి రెడ్డమ్మల యింటికి వెళ్ళివుంది. పని చేయడం కోసంకాదు. రెడ్డమ్మలు ఏం తింటుండారు, ఏం తాగుతుండారు, మొహానికి ఏం పూసుకుంటారు... ఎట్లా మాట్లడ్తారో యివన్నీ పరికించడం కోసం... వాళ్ళ యింట్లోని పెద్దపెద్ద అద్దాల్లో తననితాను చూసుకోవడం కోసం. ఒకసారి చిన్నరెడ్డమ్మ పారేసిన పెయిరండ్లవ్లీ ట్యూబు తీసుకొచ్చి, చీల్చి దానిలోపల క్రీము నాలుగయిదురోజుల పాటు మొహానికి రాసుకుంది జ్యోతి. అది వాడాక అద్దంముక్కలో చూసుకుంటే తన మొహం తేటంగానూ, తెల్లగానూ అన్పించింది. అప్పట్నుంచీ అవ్వని అట్టాంటిది కావాలని వేధించసాగింది. ఒళ్ళుమండి అవ్వ వీపు సాపు చేసిందే తప్ప అట్టాటి ట్యూబు కొన్లేదు.

"మే జ్యోతా... రా...రా... ఆడ సినిమా బండొచ్చింది. కొత్త సినిమా మార్చినారంట. కాగితాలిస్తుండారు. సిరంజీవి సినిమా మే..." బయట్నుండి పరిగెత్తుకుంటూ వొస్తూ వొగరుస్తూ చెప్పింది చిట్టి, జ్యోతి తరవాతది.

ఫెట్...ఫెట్...ఫెడేల్మంటూ నాలుగుబాదులు బాదింది బుజ్జమ్మ చిట్టి వీపుమీద.

"లమ్డీముండల్లారా... నా కండలు కరిగించి తెచ్చిందంతా మీ యదాన గొడ్తుండాను గదే. యింత చిన్నపనికి సాయమేమన్నా వుండాదా? సిరంజీవి సినిమా అంట సిరంజీవి సినిమా... ఫొండే పోయి సిరంజీవి సంకనాకుబోండి..." ఉద్వేగాన్ని ఏంచేసుకోవాలో అర్థంకాక పిడిగుద్దులు గుద్ది, చిట్టిని జుట్టుపట్టి లాగితోసింది బుజ్జమ్మ.

ఎదురుచూడని ఈ దెబ్బలతో ఒక్క నిముషం షాక్‌లో వుండిపోయి ఆ తరువాత నోరంతా తెరిచి బిగ్గరగా ఏడవసాగింది చిట్టి .

"చంపేసిందమ్మా... చంపేసింది బిడ్డని. ఈ ముండా గన్నా బిడ్డలు దెబ్బలు తిని తినే సావబోతారు..." చిట్టిని దగ్గరకి లాక్కుని వీపు నిమురుతూ శాపనార్థాలు పెడుతోంది సుబ్బమ్మ. ఆ తిట్టడంలో ఎక్కువభాగం కూతురి మీద నిష్టూరాలే.

దాంతో బుజ్జమ్మకి మళ్లీ శివమెత్తింది.

"మొ.. నేను పెట్టింది తినేసి, చెప్పిందిని గమ్మన పడుంటారా వుండండి. లేదంటే బయటికి పొండి... మీ వల్ల మా మొగుడూ, పెళ్ళాల సందు దినుమ్మూ తగువే కదా... ఎంత తమ్ముడి పిలకాయిలయితే మాత్రం ఓపికుండాదా నాకు చేసిపెట్టడానికి. గోసంగులు మాదిరి ఎదిగుండాయి. యింకా పనికి పోకపోతే ఎట్లా జరగతాది?"

"యాందిమే నువు జెప్పేది నేను గాన ఒద్దంటుండానా? అయమ్మి పనికిపోతానంటే... పొమ్మనేగదా చెప్తా వుండాను. నువు గూడ యింటానే వుంటివే" సాగదీసింది సుబ్బమ్మ.

"మొ... అదంతా నాకు తెలవదు. రెడ్డెమ్మ రేపు బుధారం నాటికి మద్రాసుకి పోతాదంట, సుజనమ్మ దగ్గరికి. ఆ పొద్దునాటికి ఈయమ్మిని కూడా అంపితే తీసకపోయి కూతుర్దగ్గిర వదిలిపెట్టొస్తాదంట..." చెప్పింది బుజ్జమ్మ.

తల్లి మౌనంగా వుండడం చూసి మళ్ళీ "మొ... నాకు తెలవకడగతానుగాన్యా మనిళ్ళ కాడ కంటే వోళ్ళిళ్ళ కాడ బాగ జరగదా? మనం రెండు పూట్లా రెండేసి కూరల్తోగిన తింటుండామా చెప్పు?" అంది.

"ఆ... నాకెందుకి తెలవదా? రేత్రి కూరలు పొద్దునా, పొద్దటి కూరలు రేత్రే గదా పెట్టేది రెడ్డోరింట్లో..." మనసులోనే గొణుక్కుందిగానీ, పైకి అనడానికి ధైర్యం చాల్లేదు సుబ్బమ్మకి.

"మొ... యిన్ని మాటలు బళ్ళే. బుధారం నాటికి ఆయమ్మికి ఏం జెప్తావో చెప్పుకో... గుడ్డలు రెండు జతలూ వుతికి ఆజరుగా బెట్టు. రెడ్డెమ్మతో పంపించేది పంపించేదే. జ్యోతిని పంపిస్తానంటేనే కదా మొన్న మనింట్లో పెళ్ళికి అయిదేలిచ్చిందామె. మనమీద ప్రేమ పుట్టిగాన యిచ్చిందా? పన్చేసుకోపోకపోతే ఎట్ట తీర్చాలని? బుధారం ఆయమ్మి పొయ్యిందా సరే లేదంటే పిలకాయలిద్దర్నీ తీసుకుని నువ్వు వూరికి పో... నేను మేపలేను మిమ్మల్నందర్నీ... నా వల్ల గాదు" ఖచ్చితంగా చెప్పి తల ముడేసుకుంటూ, పైటని ఎగేసుకుంటూ బయటికి నడిచింది బుజ్జమ్మ యింక పనాళయిపోయిందనుకుంటూ.

"పద్మమ్మింటికి నేన్పోతాలేమ్మే... నీవు రెడ్డోరింట్లో చేసుకో " కూతురు మళ్ళీ రెండో పూట పనికి పోతుంటే సుబ్బమ్మకి జాలేసింది.

"ముందు నువ్వసలు యింట్లో వుండేదా, బయటకు పోయేదా తేల్చుపో అవతల బోదువు పద్మమ్మింటికి.." ఏవయినా తను తిరిగొచ్చేలోపుగా తేలిపోవాల్సిందిగా చెప్పి విసవిసా రెడ్డోరింటి వైపుగా సాగింది బుజ్జమ్మ.

ఆ ఉదయం ఇటుక శూల నాయుడోళ్ళింట్లో తిన్న మూడు యిడ్లీలే... రెడ్డోరింట్లో తాగిన టీనీళ్ళే. నడుస్తూంటే కళ్ళు తిరుగుతుండాయామెకి. కాళ్ళులాగతుండాయి. రెండిళ్ళల్లో పెట్టిన సద్దన్నమంతా దెచ్చి మేనకోడళ్ళకీ, తల్లికీ పెట్టింది. మొగడు చీకట్తో శూలపనికి పోయినా డంటే రేత్రిగ్గానీ రాడు. ఎంత సంపాదిస్తాడో ఏమో. తాగుడికి, ముండలకీబోను మిగిల్తే బుజ్జమ్మ చేతికిస్తాడు.

లేకపోతే అడిగేదానికి లేదు... బుజ్జమ్మ ముసలిదయిపోయింది వాడి దృష్టిలో. వాడు మాత్రం అట్లనే వుండాడు ఆ పొద్దుట్నుండి ఈ పొద్దుటిదాకా. నడుస్తోందేగానీ బుజ్జమ్మ ఆలోచనలన్నీ గందరగోళంగా వున్నాయి. సుజనమ్మేవడిగిందీ నడవ. "ఈ బుజ్జమ్మని నిల్చే యండి మమ్మీ... నాలుగు రోజులయినట్టుంది స్నానం చేసి. ఇదే చీరతో వస్తోంది. మా అత్తింట్లో అయితే ఎంత మాత్రం ఒప్పుకోరు, యిట్లాంటి పనోళ్ళని వుంచుకోవడానికి. మా యింట్లో వుండే లక్ష్మి పనిపిల్ల ప్రతిరోజూ స్నానం చేయందే వూరుకోరు మా అత్తమ్మ..." అత్తింటి గొప్పలు చెప్తూ తనకి దూరంగా జరిగింది.

ముక్కుమాత్రం మూసుకోలేదంతే. నిజమే.. తను నాలుగు దినాలుగా యిదే చీరతో వుంది. నీళ్ళు పోసుకున్నా కూడా మళ్ళీ యిదే కట్టుకుంటాది. సుజనమ్మ మాదిర్తో నాకేవన్నా బీరువానిండా చీరలుండాయా? మోటారు నిండా నీళ్ళుండాయా పొద్దనా, సాయంత్రం యిప్పిన చీరలు ఉతికేయడానికి పనోళ్ళుండారా? నీళ్ళు పోసుకోని తిప్పటానికి.

ఉణ్ణెమ్మ ఏ కొప్పయినా పెడ్తాది.. ఏ మాటయినా అడగతాది. ఇంత అన్నానికి గతిలేక వోళ్ళింట్లో పాచిపని చేసేప్పుడు వాళ్ళేమన్నా పడాల. వాళ్ళేంపెట్టినా తినాల. ఎందుకోగాని కళ్ళలో నీళ్ళూరాయి బుజ్జమ్మకి. ఒక్కగానొక్క కూతురు పెళ్ళయేదాకా తనతోపాటు పనికీ బాటకీ వచ్చేది . ఏ యింట్లో ఏయమ్మ తొందరపడి ఒక మాటన్నా పన్నెత్తి మాట్లాడేవాళ్ళు కాదు తనూ కూతురు. ఆ మంచితనం మీదే కదా నమ్మి అయిదేలిచ్చింది రెడ్డెమ్మ. ఆయమ్మ మాట దక్కిచ్చాల్నా పళ్ళేదా? ఇన్ని యిళ్ళల్లో పని చేస్తుండాదిగాని ఆయమ్మంత మంచోళ్ళు యాడా వుండరు. ఆయమ్మ మాదిరి ఎవురూ పెట్టరు.

వూడిపోయిన జుట్టుని మళ్ళీ ముడేసుకుని పైట సర్దుకుంది బుజ్జమ్మ. ఈ దినాల్లో ఎవరు? అంత బాగా మాట్టాడేవోళ్ళు. పాచిపని చేసుకునేదాన్ని నమ్మి డబ్బులిచ్చేటోళ్ళు. రెడ్డెమ్మ మంచితనాన్ని పదేపదే జ్ఞాపకం చేసుకుంటోంది బుజ్జమ్మ.

ఈ రోజుల్లోనే పనివాళ్ళని యిదివరకటంత నీచంగా కాకుండా బాగా చూసుకుంటున్నా రనీ, నాటికాలం నుండీ పని చేసి చేసి ఎర్రబడిని పనోళ్ళ కళ్ళని చూసి ఒకింత జంకుతున్నారనీ, తమ పనికీ, చేతులకీ అంత విలువ వుందనీ బుజ్జమ్మకి తెలీదు. ఎవరయినా చెప్పినా అర్థం కాదు.

రెడ్డెమ్మ చానా మంచిది. అంతే... ఎంత మంచిది కాకపోతే ఐదేలిస్తాది. తను జ్యోతిని పంపిస్తానంటే మాత్రం ఒప్పి ముందుగా డబ్బులీయడమంటే గొప్పే కదా... ఈ పిల్లగ్గాకపోతే అర్థంగావడం లేదు గాన్యా...

సుజనమ్మ అత్తోళ్ళు యింకా గొప్పోళ్ళంట. పనోళ్ళని అంతబాగా సూస్తారంట. దినుమ్మూ నీళ్ళు బోసుకోవాలంట. పనిపిల్లకి యేరేగా ఒక సబ్బిస్తారంట. వాళ్ళ పిలకాయిలు బిస్కెట్లు దింటే బిస్కట్లు, కేకులు దింటే కేకులూ యిప్పిస్తారంట పనోళ్ళగ్గాడ. అట్టాటి తిండి తినడానికయినా దీనికి ప్రాప్తముండొద్దా? అన్నీ అమ్మ బుద్దులూ... భోగమేషాలు.

అయినా ఈపిల్ల పోనని మొండికేస్తే ఏంజెయ్యాలి ? తనకొచ్చే ఈ జీతం డబ్బుల్తో ఎప్పటికి అప్పుదీర్చాల? అప్పుతీర్చకుండా సచ్చిపోతే యిహనేమయినా వుండాదా? బుజ్జమ్మ దెయ్యమై పుడ్తాది.

అలవాటుపడ్డ కాళ్ళు అప్పటికి పద్మమ్మ యింటికి తీసుకుపోవడంతో బుజ్జమ్మ ఆలోచనల బండికి అంతరాయం కలిగింది.

"యాంబుజ్జీ-పొద్దున మొగిచ్చేసినావు? అవున్లే రెడ్డోరిళ్ళల్లో అయితే ఒక్కనాడు గూడ మొగిచ్చకుండా జేస్తావు. ఆ శకుంతలమ్మ యిచ్చినట్లు నేనీగలనా వేలకువేలు? తను చేయలేని పని శకుంతల చేసినందుకు అక్కసుగా వుంది పద్మమ్మకి. దాదాపు ప్రతిరోజు యిదే రకమయిన స్వాగతం లభిస్తుంది బుజ్జమ్మకా యింట్లో. అయితే తిట్ల ధండకంలో మాత్రం కాస్త తేడా వుంటుంది.

* * *

కూతురి నోట్లో నుండి తమని యింట్లో నుండి బయటికి నడవమన్న వార్త వినగానే సుబ్బమ్మ గుండె వొణికింది....

మొగుడ్ని మింగి, పెద్దకొడుకుని మింగి, మూడో కూతుర్ని మింగి... తను మాత్రం శిలేసుకుని నిలబడ్డాదీ భూమ్మీద. యిదిగో యియ్యన్నీ చూడ్డానికే గావాల.

నలభయి రెండేళ్ళనాడు తనీ వూరికి కోడలయి వచ్చినపుడు ఈ వూరిట్లా లేదు. బజారు వీధిలోని పదిపదిహేను యిళ్ళు మాత్రమే మొత్తంవూరు. వూరు మొత్తానికీ కలిపి శెట్టంగడొకటే వస్తువులకి. ఊరికి ఒక చివరగా గాంధీ మండపముండేది. ఇక ఆ తర్వాత కాళాస్త్రి రోడ్డు పొడుగూతా మొత్తంపంట పొలాలే. అక్కడే తమకి మావగారిచ్చిన రెండెకరాల మాగాణి వుండేది. రెండు కార్లు పైరు పెట్టేవాళ్ళప్పుడు. మొగుడితో పాటు తనూ పొలానికెళ్ళి ఒక రాత్రిపగలూ లేకుండా రెక్కలు ముక్కలు చేసుకొనేది. ఆదాయం కూడా బాగానే వుండేది.

ఆ తరువాత నాలుగయిదేళ్ళకి చనగ, జొన్న, సజ్జ పంటలు చాప కింద నీళ్ళ మాదిర వచ్చేశాయి వూళ్ళోకి. ఉత్తరాది నుండొచ్చిన ఒక రైతు జొన్నేసి సంపాయిచ్చేసినాడని అంతా దానికే మళ్ళుకున్నారు.

దాని అనుపానులు సరిగ్గా తెలుసుకోలేక రవణయ్య చేతులు కాల్చుకున్నాడు. అదే మొదలు అప్పుజెయ్యడం. అంతకు ముందుగా అప్పంటే ఏందో తెలీని తమకి రెడ్డోరి కాడ వెయ్యిరూపాయిలు అప్పు నిల్చిపోయింది.

తెచ్చిపెట్టిన పెట్టుబడి తుడిచిపెట్టుకు పోవడమేగాకుండా ఆ సంవత్సరం పొడుగుతా గింజలు కొనాల్సిరావడం, మళ్ళీ పెట్టుబడికి డబ్బవసరం అంతా తడిసి మోపడయింది. ఆ తర్వాత యిహన కోలుకునిందే లేదు.

ఊరికి మరో కొసన టూరింగు టాకీసొకటి వుండేది. అది ఆరునెలలు నడిస్తే ఆరు నెలలు మూతబడేది. పావలా, అర్ధరూపాయి వుండేవి టికెట్లు. ఊరంతటికీ గాదిరెడ్డోళ్ళ అద్దకపు కొట్టు తప్ప మరేరకమయిన గుడ్డలు దొరికేవి కావు. రెడ్డెమ్మలు మాత్రం పట్నం నుండి ఏం తెచ్చుకునేవాళ్ళో ఏమో వూళ్ళో మిగిలినోళ్ళంతా ఆ అద్దకం చీరలే కట్టేవోళ్ళు. అదీ ఒకటి రెండు మించి వుండేవికావు. మొగోళ్ళకి మల్లుపంచెలు.

ఆ మరుసటేడు గాంధీ మందిరం పక్కనున్న అమరాశెట్టి పొలాలన్నీ దక్షాది నుండొచ్చిన రెడ్డెవరో కొన్నాడనీ, లక్ష రూపాయిల్తో సినిమాహాలు కడ్తుండాడనీ వూరంతా అగుబ్బుగా చెప్పుకున్నారు.

రవణయ్యకి వూపిరొచ్చింది. అమరాశెట్టి పొలంపక్కనే తమ కయ్యిలుండేది. అప్పటికే పుట్టి పెరుగుతోన్న కొడుకులిద్దర్నీ బుజ్జమ్మనీ, చిన్నమ్మనీ చూపించి కాళ్లావేళ్ళా పడి ఏడ్చినా, పెళ్ళాం మాట ఏమాత్రం లెక్కచేయకుండా ఆ రెండెకరాలూ దక్షాదిరెడ్డి కమ్మేశాడు.

అదేమంటే వడ్డీ పెరుగుతూ పోవడంకన్నా అప్పు తీర్చడమే మంచిదన్నాడు. ఆ మిగిలిన డబ్బుతో యాపారంజేసి కుటుంబాన్ని ఎక్కిస్తానని ఆడంబరపు మాటలు జెప్పాడు. చెప్పినట్లుగానే గుడ్డలంగడి పెట్టి అప్పులిచ్చేసి, సంవత్సరం తిరక్కుండానే దివాళా తీశాడు.

పశువులు మేపుకుని, పొలం దున్నుకుని మట్టి పిసుక్కుని బతికేటోళ్ళకి యాపారాలెట్ట దెలస్తాయి.

పిలకాయల్ని అన్యాయం చేశానన్న దిగుల్తోనే మంచంపట్టి పోయాడు రవణయ్య. అప్పటికి పెద్దోడు పధ్నాలుగేళ్ళవాడు. దక్షాదిరెడ్డి కమ్మేసిన తమ పొలంలోనే సేద్దిగాడిగా కుదిరిపోయాడు. అమాటకొస్తే ఆ దినాల్లో తమ మాదిరి చిన్నరైతులంతా కూడా కయ్యిలమ్మేసుకుని కూలోళ్ళుగా మారిపోయారు.

పెద్దోడికి ముందుది బుజ్జమ్మ, ఎనకటోళ్ళు చిన్నమ్మి, చిన రవణడు చెనగ్గితకీ, జొన్న ఒలుపుడుకీ, సజ్జితకీ పోవడం మొదలుపెట్టారు. తనేమొ అదే రెడ్డింట్లో పాచిపనికి కుదిరి పోయింది. ఇప్పుడు రెడ్డోరివే రెండిళ్ళయినాయి. ఆ రెండిళ్ళలోనూ బుజ్జమ్మే పని చేస్తోంది.

పెద్దోడికి పెళ్ళయి, ఖిద్దురాడ పిలకాయిలు పుట్టినాపాట చెరుకుతోటలో పాము కర్చి చచ్చిపోయినాడు. ఇదే చాలన్నట్టు కోడలు ఎదురింట్లో బాడిక్కుంటున్న ఇస్కూలు అయివోరితో లేచిపోయింది. ఆ పొద్దుట్నుండీ తను మనవరాళ్ళిద్దరితో బుజ్జి పంచన చేరి పోయింది. చిన్నకొడుకు, చిన్నకూతురు తన్యాడుండాదని కూడా తలవరు. తిట్టినా, పిలకాయిల్ని చావబాదినా బుజ్జమ్మే గెతి తనకి. ఈ ముండా గన్న పిలకాయిల వల్ల ఈ పొద్దునాటికి అయమ్మి చేత కూడా గెంటించ్చుకునేట్టుగా వుండాది... ప్చ్...ఇస్...

“అవా...అవా...అన్నం బెట్టువా” చిట్టి అవ్వని వూపేస్తూ అడిగింది. పాత ఆలోచనల్లో నుండి బయటపడ్డ సుబ్బమ్మకి మండిపొయ్యింది.

“ఆ..ఆ.. వొండి పెట్టుండాను రండి.. బాగ సెప్పిన మాటినే పిలకాయిలయి పోతిరి” కసురుకుంటూ పైకి లేచిందామె. కూతురొచ్చే యాళయిందనుకుంటూ.

“అవో.. అన్నం బెట్టువా...” ఆపకుండా అరుస్తోంది చిట్టి అదో పాటలాగ రాగం తీస్తూ. “అత్త రాల్యా యింకా” అత్త మధ్యాహ్నం తనని బాదిన సంగతి మర్చిపోయి అడిగింది. ఆ పిల్లకి బాగా తెలుసు అత్తొస్తేనే తనకిన్ని మెతుకులని.

“మే జ్యోతా...” పిలిచింది సుబ్బమ్మ హఠాత్తుగా ఏదో గుర్తొచ్చినట్లు.

“ఏంవా?” అత్త అటు పని కెళ్ళగానే తనూ యిటు సినిమాబండి కాడికి పరిగెత్తి, సావాసగత్తెలతో ఆటలాడి తిరిగొస్తూ పలికింది జ్యోతి.

“మే జ్యోతా... యాడకి బోయినావుమే... యిట్టగదా మీరు తన్నుల్దింటుండేది... అంతా నా కర్మ. ఇట్రాండిమే చెప్తాను” అవ్వ ఆ విధంగా పిలవడం అదివరకెన్నడూ లేకపోవడంతో ఆశ్చర్యంగా యిద్దరూ అవ్వవద్దకెళ్ళారు.

వాకిట్లోని అరుగు మీద కూర్చుని యిద్దర్నీ చెరో పక్క కూచోబెట్టుకుంది సుబ్బమ్మ.

“మే.. జ్యోతా అత్త లేకపోతే మిమ్మలిద్దర్నీ యానాడో బాయిలో యేసి నేను దూకే సుందునుమే... నాకు శక్తుండాదా చెప్పు మిమ్మల్నిద్దర్నీ సాకడానికి. మీరు బతికినన్నాళ్ళు నేను బతకబోతానా? అత్త చెప్పినట్టిని సుజనమ్మోళ్ళూరికి బోమే... నాయమ్మగద. లేకుంటే మన ముగ్గుర్నీ బయటికి దోసేస్తాదిమే...” కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ వొణికే గొంతుతో అవ్వ జ్యోతి గెడ్డం పట్టుకుని బతిమిలాడ్డం చూస్తుంటే చిట్టికి ఏడుపొచ్చింది.

“పో యేం మే...” అన్నది అక్కనుద్దేశించి.

జ్యోతి చిట్టికేసి ఒకసారి గుర్రుగా, నిశితంగా చూసింది. ఆ చిరుచీకట్లో జ్యోతి చూపుల్లోని అర్థాన్ని పట్టుకోవడం కష్టమైపోయింది సుబ్బమ్మకి. అయినా "ఏందిమే.." అడిగింది మనవరాల్ని రెట్టించినట్టుగా.

జ్యోతి కాసేపు మౌనంగా వున్న తరువాత దిగులు గొంతుతో

"అవ్వా... నువ్వు, నీ తర్వాత అత్తా, రాజక్క అందరూ పాచిపని చేసేకదా బతకతా వుండారు. నన్ను గూడ మీ మాదిర్తో పాచిపనిలోకి దించతారా అవ్వా" అన్నది దీనంగా.

మనవరాలి మాటల్తో కడుపు తరుక్కుపోయింది సుబ్బమ్మకి. కానీ వేరే మార్గం లేదు. కూతురొచ్చేలోపుగా ఎలాగయినా జ్యోతిని ఒప్పించితీరాలి. అందుకే మళ్లీ బతిమాలసాగింది. అవ్వ అలా అడుగుతూంటే ఏడుపొచ్చింది చిట్టికి. పైకే ఏడుస్తూ...

"అవ్వా ఈయమ్మి కాకపోతే నేన్పోతానవ్వా పనికి. నాకేం భయంలేదు. సుజనక్క నాకు తెలవకపోతేగద... సుజనక్క కొడుకునెత్తుకోడం ఒక పనా? నువు బాధపడబాకవ్వా. నేన్పోతానంటే పోతానంతే" అన్నది చిట్టి అవ్వకి ఒట్టేసినట్టు చెపుతూ.

దిగులుతో ముడుచుకు పోయిన అవ్వ గుండెల్లో ఒక కొత్త ఆశ పొడ చూపింది.

* * *

అనుకున్నట్లుగానే బుధవారం రానే వచ్చింది. తెల్లారడాని కింకా కొంత సమయముంది. ఆకాశం నిండా మబ్బులు గొర్రెల మందల్లా ఎడాపెడా కదులుతున్నాయి. బుజ్జమ్మకి నిద్ర పట్టలేదు. లేచి మొగుడికి టీ పెట్టడం కోసమని పొయ్యి రాజేసి ఆ తర్వాత చిట్టి కోసమని స్నానానికి నీళ్ళకాగు ఎక్కించింది. అంట్లన్నీ బయట తొట్టి ముందేసుకుని నీళ్ళు తెచ్చి పోసుకుంది. వాటిముందు కూచుని తోముతూండగా విన్పించిందామెకా గావుకేక.

"ఒయమ్మా... అమ్మా... సచ్చినానమ్మా... అత్తా అవ్వా" అంటూ కేకలు పెడ్తున్నది జ్యోతా లేక చిట్టా ఒక్క నిమిషం అర్థం కాలేదు బుజ్జమ్మకి.

పిల్లలిద్దరి గొంతులూ యించుమించు ఒకేలా వుంటాయి. తను యింట్లోనుండి అంట్లు తీసుకుని బయటికొచ్చేటప్పటికి యిద్దరూ లేవలేదు. ఇంతలో ఏమయింది. కాళ్ళూ చేతులూ వొణుకుతూంటే తోముతున్న అంట్లు పక్కన పడేసి యింటి గుమ్మంకేసి పరిగెత్తి అవాక్కయిపోయింది.

జ్యోతి పొయ్యిలో కణకణలాడుతోన్న కొరివి కట్టెని లాగి చిట్టి అరచేతుల్లో వాతలు వేస్తోంది. చిట్టి పెడుతోన్న ఆర్తనాదాన్ని లెక్కచేయకుండా.

"పోతావుమే.. పనికి బోతావా పనికి.. యిహనబో ఎట్టబోతావో" అంటూ కసిగా చిట్టి రెండు అరచేతుల్నీ కదలకుండా కాలేసి నొక్కిపట్టి కొరివి కట్టెతో గట్టిగా అణుస్తోంది.

చిట్టి పెడుతున్న గావుకేకలు ఆ గుడిసెను దాటి, వాడలోకి, వాడను దాటి ఊళ్ళోకి, ఊరిని దాటి సమాజంలోకీ వలయాలు వలయాలుగా ప్రవహిస్తోన్నాయి.

అప్పటిదాకా గొర్రెలమందల్లా అటు ఇటు కదులుతోన్న మేఘాలు హఠాత్తుగా వర్షించడం మొదలుపెట్టాయి. ఆ యింట్లోని సంఘటనలకి, జీవితాలకీ సాక్షీభూతంలా నిలబడి వుంది నిద్రగన్నేరు చెట్టు.

రచన, నవంబరు 2000

కథా నిలయం
4682
శ్రీకాకుళం